క్లుప్తంగా

తెరుచుకున్న హాస్టల్

సాక్షి ఎఫెక్ట్..

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్ 'హాస్టల్‌ను పునఃప్రారంభించాలి' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం జిల్లా విద్యా శాఖ అధికారులు స్పందించి మోడల్ స్కూల్ హాస్టల్‌ను పునఃప్రారంభించారు. కార్యక్రమంలో జీసీడీఓ విజయ కుమారి, హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

దంతాలపల్లి తహసీల్దార్‌గా రాజేశ్వర్



దంతాలపల్లి: దంతాలపల్లి తహసీల్దార్‌గా కాటం చంద్ర రాజేశ్వర్ నియమితులయ్యారు. మంగళవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. కామారెడ్డిలో డీటీగా పని చేసి పదోన్నతిపై ఇక్కడి వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రావు ఇటీవలే పదవీ విరమణ అయ్యారు.

తొర్రూరు తహసీల్దార్‌గా శ్రీనివాస్



తొర్రూరు: తొర్రూరు తహసీల్దారుగా జి.శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేసిన వినోద్‌కుమార్ స్థానిక ఆర్డీఓ కార్యాలయ ఏఓగా బదిలీ అయ్యారు.

అదనపు కలెక్టర్‌కు వినతి



మహబూబాబాద్: జిల్లాలో భారీ వర్షాలతో జరిగిన నష్ట నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండల వెంకన్న డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్వర్లు, సక్రు, లింగన్న, ఆలకుంట్ల సామ పాపయ్య, యాకయ్య పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించాలి

మహబూబాబాద్: భారీ వర్షాలతో మున్సిపాలిటీ పరిధిలో భారీనష్టం వాటిల్లిందని నష్టంపై నివేదికలు తయారు చేయడంతోపాటు సమస్యలను గుర్తించి మరమ్మతు పనులు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మంగళవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ మార్నెని వెంకన్న, కమిషనర్ నోముల రవీందర్, చిట్యాల జనార్దన్, డీఈ సీహెచ్ ఉపేందర్, శ్రీధర్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

నర్సింహులపేట: రేషన్‌కార్డు ఉన్న ప్రతీ ఒక్కరు గృహజ్యోతి పథకంను సద్వినియోగం చేసుకోవాలని ఏఈ పాండు తెలిపారు. మంగళవారం ఆయన కొమ్ములవంచ సబ్‌స్టేషన్‌లో మాట్లాడారు. విద్యుత్ మీటర్ లేని వారు రేషన్ కార్డు జిరాక్స్‌తోపాటుగా ఇంటి పన్ను రసీదు, అధార్‌కార్డు రూ.938లను లైన్‌మెన్, జేఎల్‌ఎంలకు అందజేస్తే మీటరు అమరుస్తారని తెలిపారు. ఈనెల 17నుంచి నిర్వహించే ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకుంటే గృహజ్యోతిలో 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఉపయోగించుకోవచ్చని తెలిపారు.

వరద బాధితులను ఆదుకోవాలి

కురవి: వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం నాయకులు ఆమెడ నాగయ్య, గంధసిరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రం శివారులోని డబుల్ బెడ్రూం ఇళ్లను, వరదలతో నష్టపోయిన ప్రాంతాలను సీపీఎం బృందం పరిశీలించింది. అనంతరం జీపీ కార్యదర్శికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణయ్య, జ్యోతిబసు, కిషన్ నాయక్, మురళి, వీరేందర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయం

తొర్రూరు: ఎయిడ్స్ రహిత సమాజ నిర్మాణమే ధ్యేయమని సర్వోదయ స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు మేనేజర్ శాంతరాజ్ అన్నారు. సర్వోదయ సంస్థ ఆధ్వర్యంలో ఎయిడ్స్ మహమ్మారి నియంత్రణపై మంగళవారం డివిజన్ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



డోర్నకల్: స్థానిక రైల్వే స్టేషన్ ఎదురుగా రోడ్డు పక్కన మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా మారింది. మ్యాన్‌హోల్‌పై ఎలాంటి కవర్ ఏర్పాటు చేయలేదు.

పోరాట యోధురాలు ఐలమ్మ

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. ఐలమ్మ ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని, ఆమె ఉద్యమ స్ఫూర్తిని గుర్తు చేసుకోవాలన్నారు. - సాక్షి నెట్‌వర్క్



మహబూబాబాద్: ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రామ్మోహన్‌రెడ్డి, తదితరులు



మహబూబాబాద్ అర్బన్: పూలమాల వేస్తున్న డోలి సత్యనారాయణ



మరిపెడ మున్సిపాలిటీ కార్యాలయంలో..



గార్ల: నివాళులర్పిస్తున్న నాయకులు



కేసముద్రంలో..



కురవిలో..



డోర్నకల్‌లో..



నర్సింహులపేటలో..

డంపింగ్‌యార్డు తొలగించాలని ధర్నా

తొర్రూరు రూరల్: డంపింగ్‌యార్డును తొలగించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని హచ్చుతండాకు చెందిన గిరిజనులు మంగళవారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా తండావాసులు మాట్లాడుతూ.. తొర్రూరు మున్సిపాలిటీకి చెందిన డంపింగ్‌యార్డు తండా సమీపంలో ఉండడంతో విపరీతమైన దుర్వాసన వస్తుందని, తద్వారా అనేక రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో అనేకసార్లు తొర్రూరు మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన పట్టించుకోలేదన్నారు. వెంటనే సంబంధిత ఉన్నతస్థాయి అధికారులు స్పందించి డంపింగ్ యార్డ్‌ను వెంటనే తొలగించాలన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్సై ఉపేందర్ సంఘటన స్థలానికి చేరుకొని తండవాసులకు సర్ది చెప్పి ధర్నాను విరమింపజేశారు.



రోడ్డుపై ధర్నా చేస్తున్న హచ్చుతండా వాసులు

చికిత్స పొందుతున్న రైతు మృతి



గోప (ఫైల్)

కురవి: ప్రమాదవశాత్తు గణేష్‌కుంట అలుగులో పడి తీవ్రగాయాలైన రైతు చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందినట్లు సీరోలు ఎస్సై సీహెచ్.నగేష్ తెలిపారు. సీరోలు శివారు రేకుల తండా గ్రామానికి చెందిన తేజావత్ గోప(65) అనే రైతు ఆదివారం పొలం వెళ్తుండగా తండా శివారులోని గణేష్ కుంట వద్ద ప్రమాదవశాత్తు కాలు జారి నీటి గుంతలో పడిపోయాడు. దీంతో అతడి పక్కటెముకలకు విరిగాయి. వెంటనే మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు.

ఉరివేసుకొని ఆత్మహత్య

గూడూరు: అనారోగ్య సమస్యలతో ఓ వ్యక్తి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎలమందల పెద్ద సమ్మయ్య (68) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మనస్తాపం చెంది భార్య ఇంట్లో లేని సమయంలో ఉరి వేసుకున్నాడు. స్థానిక సీహెచ్‌సీకి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మరిపెడ రూరల్: తండాధర్మారంలో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ ఎల్లమ్మ

మరిపెడ రూరల్: పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం అని ఐసీడీఎస్ సీడీపీఓ ఎల్లమ్మ అన్నారు. మండలంలోని ఉల్లెపల్లి సెక్టార్ పరిధిలోని తండాధర్మారం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మహా ప్రోగ్రాం కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ.. పోషకాహారంతోనే రక్తహీనతను తగ్గించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగులోతు లక్ష్మీ, సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు గుగులోతు శాంతి, సుశీల, లీల, నాగచంద్ర, రోజా, పద్మ, భగవతి పాల్గొన్నారు.

మరిపెడ: మరిపెడ ఎస్సీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాస కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఐసీడీఎస్ మరిపెడ సెక్టార్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మీ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎడెల్లి సునీత, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పోషణ వారోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ శ్రీదేవి మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై, వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సమ్మెట లలిత, వేముల శ్రావణి, సుహాసిని, సరోజన, ఏఎన్‌ఎం ప్రసన్నకుమారి పాల్గొన్నారు.

వరద బాధితులకు దాతల చేయూత



నెల్లికుదురు: రావిరాలలో వరద బాధితులకు దుస్తువుల పంపిణీ..



డోర్నకల్: సరుకులు అందజేస్తున్న పాఠశాల ప్రతినిధులు

నెల్లికుదురు: మండలంలోని రావిరాల గ్రామంలోని వరద బాధితులకు వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో 130 కుటుంబాలకు నిత్యావసర సరుకులను మంగళవారం అందించారు. విద్యా హర్బస్ సంస్థ ఫౌండర్ శ్యాం ప్రసాద్ అందించిన సరుకులను ఎమ్మెల్యే మురళీనాయక్ అందించారు. మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ సరుకులను అందించారు. ఆర్‌ఎస్‌వీ, ఏఐడీ, ఆర్‌డీఎస్ అమెరికా స్వచ్ఛంద సంస్థ సహకారంతో సరుకులు, దుప్పట్లు అందించారు.

బయ్యారం: మండలంలోని పలు గ్రామాల్లో వరద బాధితులకు మంగళవారం రూరల్ డెవలప్‌మెంట్ సోషల్ సర్వీస్, రైతు స్వరాజ్య వేదిక సహకారంతో నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి గౌని ఐలయ్య, పద్మ, భిక్షం, మధు పాల్గొన్నారు.

డోర్నకల్: సీరోలు మండలం మోదుగ్గడ్డతండాలో వరద బాధితులకు మంగళవారం బ్రిలియంట్ స్కూల్ కరస్పాండెంట్ వక్కంతుల అప్పారావు, ప్రిన్సిపాల్ అప్సరాబేగం ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

హోప్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో..

మరిపెడ రూరల్: ముంపు గ్రామాలైన మరిపెడ మండలం సీతారంతండా, బాల్నిధర్మారం వరద బాధితులకు హోప్ చారిటబుల్ సొసైటీ ఖమ్మం వారు దుప్పట్లు, దుప్పట్లు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ ఎల్లయ్య, రమేష్, యాసిన్ పాల్గొన్నారు. 11ఎంయూఎల్501

కేసముద్రంలో..

కేసముద్రం: కేసముద్రంస్టేషన్, అర్పనపల్లి గ్రామాల్లో జాటోత్ హుస్సేన్‌నాయక్ పంపించిన నిత్యావసర సరుకులను బీజేపీ మండల అధ్యక్షుడు పాదిల నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం పంపిణీ చేశారు.

ఐదు క్వింటాళ్ల నల్లబెల్లం పట్టివేత



పట్టుబడిన బెల్లం చూపుతున్న పోలీసులు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ ఎక్సైజ్ స్టేషన్, డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది రైల్వేస్టేషన్, కురవి గేటు, సాలార్‌తండా, బాబునాయక్ తండాల్లో దాడులు నిర్వహించి 5క్వింటాళ్ల నల్లబెల్లం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ జి.చిరంజీవి తెలిపారు. మంగళవారం ఆయన కేసు వివరాలు వెల్లడించారు. నెల్లూరు నుంచి రైలు ద్వారా మహబూబాబాద్ రైల్వే స్టేషన్‌కు నల్లబెల్లం, పటికను తీసుకువచ్చి చిన్నగూడూరు మండలం మంగోరిగూడెం తండా, కేసముద్రం మండలం బడి తండాకు సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. మంగోరిగూడెంకు చెందిన లూనావత్ మహేందర్, మచ్చ వీరన్న, బడితండాకు చెందిన బానోత్ మోహన్, బోడమంచతండాకు చెందిన భూక్య చంటిపై కేసు నమోదు చేసి, వారివద్ద నుంచి ఐదు క్వింటాళ్ల నల్లబెల్లం, ఇరవైకిలోల పటిక, ఇరవై లీటర్ల గుడుంబా, నాలుగు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. ఈ దాడుల్లో డీటీఎఫ్ సీఐ సీహెచ్.సీరజ, ఎక్సైజ్ ఎస్సై కిరీటి, సిబ్బంది వెంకన్న, శేఖర్, నర్సింహారావు, హచ్య, రాజు, ఇబ్రహీం పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడి పనిచేయాలి

● ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్



గూడూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: కొంతమంది అధికారుల తప్పిదంతోనే ప్రభుత్వానికి చెడు పేరు వస్తుందని, అలాంటి వారు నిర్లక్ష్యం వీడి పనిచేయాలని ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ వీరస్వామి అధ్యక్షతన వర్షానికి జరిగిన నష్టంపై పలు శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సమావేశానికి ఆలస్యంగా హాజరైన అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి రాని అధికారులకు మెమోలు ఇవ్వమని ఎంపీడీఓకు సూచించారు. ప్రజలకు ఆరోగ్యం, విద్యుత్, తాగు నీరు సమస్యలు రాకుండా చూడాలన్నారు. రుణమాఫీ అర్హులందరికీ ఎలాంటి టెక్నికల్ సమస్యలు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎడ్ల నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

అధికారులు విశ్రమించొద్దు

నెల్లికుదురు: మళ్లీ ఇలాంటి విపత్తులు జరగకుండా ఉండేందుకు అన్నిచర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మురళీనాయక్ అధికారులను ఆదేశించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. వర్షాకాలం సద్దుమనిగే వరకు గ్రామస్థాయి నుంచి జిల్లాస్థాయి వరకు ఏ ఒక్క అధికారి విశ్రమించొద్దన్నారు. ముఖ్యంగా ఎంపీడీఓ కార్యాలయ అధికారులు, విద్యుత్, ఆర్‌అండ్‌బీ శాఖలు అలర్ట్‌గా ఉండాలన్నారు. నిర్లక్ష్యంగా చేస్తే సస్పెండ్ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బాలరాజు, ఎంపీఓ పద్మ, అధికారులు పాల్గొన్నారు.

వారోత్సవాలను జయప్రదం చేయండి



కురవి: మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

కురవి: ఈనెల 11నుంచి 17వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం కురవిలోని సీపీఐ కార్యాలయంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కరణం రాజన్న, నాయకులు బుర్ర సమ్మయ్య, కన్నె వెంకన్న, నిలుగొండ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

నెహ్రూసెంటర్: నేటినుంచి ఈనెల 17 వరకు తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి శాఖ, గ్రామ, మండల, జిల్లా శాఖల్లో సాయుధ పోరాట అమరవీరుల స్థూపాల వద్ద నివాళులర్పించాలన్నారు.

కొనసాగుతున్న వైద్యశిబిరాలు



డోర్నకల్: వైద్యశిబిరం తనిఖీ చేస్తున్న అధికారి

డోర్నకల్: మండలంలోని ముల్కలపల్లి గ్రామ ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరాన్ని మంగళవారం ఎన్సీడీ పీఓ డాక్టర్ నాగేశ్వర్‌రావు తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ లక్ష్మినారాయణ, ఎంపీడీఓ శ్రీనివాసనాయక్, వైద్యురాలు కనకదుర్గ పాల్గొన్నారు.

మరిపెడ రూరల్: మండలంలోని సీతారాంతండా, ఉల్లెపల్లి, బాల్నిధర్మారం, పర్కజలతండా, ధారావత్ తండా మున్సిపాలిటీలోని పలువార్డుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి. మంగళవారం పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమాల్లో డాక్టర్ స్వామి, సిబ్బంది, అఖిల, సిరి, ఉపేంద్ర, సతీష్, కృష పాల్గొన్నారు.

నర్సింహులపేట: మండలంలోని కొమ్ములవంచ గ్రామంలో జనవికాస సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం మెడికేర్ మల్టీస్పెషాలిటీ తొర్రూరు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ నరేష్, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల సందర్శన

కేసముద్రం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను డీఐఈఓ చింతనూరి మదార్ గౌడ్ మంగళవారం సందర్శించారు. ఈమేరకు ఆయన పలు రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. కళాశాలలో అడ్మిషన్లు పెంచాలన్నారు. అంకిత భావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలను సాధించాలని ఈసందర్భంగా ఆయన అధ్యాపకులకు సూచించారు.

సంక్షిప్త సమాచారం

కూలిన ప్రహరీ



కురవి: మండల కేంద్రం శివారులోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల ప్రహరీ భారీ వర్షాలకు కూలిపోయింది. ముళ్లపొదల మాటున ఉన్న ప్రహరీ మంగళవారం కనిపించింది. వెంటనే సంబంధిత అధికారులు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్: వినాయక మండపాల వద్ద అగ్నిప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని డోర్నకల్ అగ్నిమాపక అధికారి ఎం.వీరేషం కోరారు. మండలంలోని అమ్మపాలెంగా గ్రామంలోని పలు వినాయక మండపాల వద్ద మంగళవారం ఉత్సవ కమిటీ ప్రతినిధులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పించారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా వెంకన్న

మహబూబాబాద్ రూరల్: కాంగ్రెస్ పార్టీ అనుబంధ ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా మండలంలోని జంగిలిగొండ గ్రామానికి చెందిన కొమ్మ రాజుల వెంకన్నను నియమించామని కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు ఘనపురపు అంజయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు రాంశెట్టి వీరేందర్ మంగళవారం తెలిపారు. ఈ మేరకు వెంకన్నకు నియామకపత్రాన్ని అందజేశారు.

వరిపొలాల పరిశీలన

కురవి: సీరోలు మండలం చింతపల్లి, కొత్తూరు (సీ) గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న వరిపొలాలను ఏఈఓ సురేష్, రమేష్ మంగళవారం పరిశీలించారు. నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామని తెలిపారు.

మహిళపై కోతుల దాడి

కురవి: మండల కేంద్రంలోని గొల్లగుట్ట బజార్‌లో మంగళవారం ఇంటిముందు కూర్చున్న మహిళ మోసం వీరమల్లమ్మపై కోతుల గుంపు దాడికి పాల్పడడంతో కాళ్లు, చేతులకు తీవ్రగాయాలు అయ్యాయి. మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



కొత్తగూడ: ఇటీవల డెంగీ జ్వరంతో మృతి చెందిన మల్లెల విజయ్‌కుమార్ కుటుంబానికి దాతలు సాయం అందిస్తున్నారు. స్థానికంగా ఉండే వ్యాపారులు, రైతులు, ఆటో డ్రైవర్లు కలిసి రూ.60వేలు, ఆదివాసీ ఉపాధ్యాయులు రూ.40వేలు, 50 కేజీల బియ్యం అందజేశారు.

రూ.10వేల ఆర్థికసాయం

నెల్లికుదురు: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన చెడుపాక ఉప్పలయ్య కుటుంబానికి కాంగ్రెస్ కార్యకర్తలు మంగళవారం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.

జర్నలిస్టులకు చేయూత

మరిపెడ రూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ఉల్లెపల్లి, భూక్యతండ గ్రామాలకు చెందిన జర్నలిస్టులు తిరుమల్ రావు, భూక్య తిరుమతి ఇళ్లు వరదల్లో చిక్కుకుని సర్వం కోల్పోయారు. దీంతో టీయూడబ్ల్యూజే (ఐజేయూ) ఆధ్వర్యంలో రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రవి, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీహరి, జిల్లా సహాయ కార్యదర్శి లచ్చయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

మరిపెడ రూరల్: ఇటీవల భారీ వర్షాలకు ఆకేరు వాగు వరదలో మండలంలోని బాల్నిధర్మారంలో ఇంటిని కోల్పోయిన తన కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వరద బాధితుడు, దివ్యాంగుడైన గౌని యాదగిరి వేడుకున్నాడు. గత నెల 31 రాత్రి వచ్చిన ఆకేరు వాగు ఉధృతికి ఇంటి గోడలు నేలమట్టమయ్యాయన్నాడు. తాను ఎంబీఏ పూర్తి చేసి ఏ ఉద్యోగం లేక వృద్ధ తల్లిదండ్రులకు భారంగా ఇంటి వద్దనే ఉంటున్నానని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

తొర్రూరు రూరల్: సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు వైద్యులు, వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీడీఓ నర్సింగరావు సూచించారు. మండలంలోని గోపాలగిరి గ్రామంలో వైద్యశిబిరాన్ని మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీఓ పూర్ణచందర్, కార్యదర్శి, వైద్యులు, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు..

మత్స్యకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

తొర్రూరు: అకాల వర్షాలతో నష్టపోయిన మత్స్యకారులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొడుగు శ్రీనివాస్ కోరారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని విశ్రాంతి భవనంలో ముదిరాజ్ మహాసభ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు.

రూ.10వేల విరాళం

కేసముద్రం: మండల కేంద్రంలో సీఎం సహాయ నిధికి గాను, ఎమ్మెల్యే మురళీనాయక్‌కు పీడీఎస్‌ఎస్ ఆధ్వర్యంలో రూ.10వేల చెక్కును విరాళంగా మంగళవారం అందజేశారు.

నివాళి

తొర్రూరు రూరల్: కమ్యూనిస్ట్ సీనియర్ నాయకుడు ముద్దం కృష్ణారెడ్డి మరణం పార్టీకి తీరని లోటని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయసారథి అన్నారు. అమ్మాపురం గ్రామంలో కృష్ణారెడ్డి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ శ్రీనివాస్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

గణనాథులకు భక్తుల పూజలు



పూజలో పాల్గొన్న అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో



పూజలో పాల్గొన్న భక్తులు

మహబూబాబాద్ రూరల్/మహబూబాబాద్/గార్ల: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జిల్లా కేంద్రంలోని పలుప్రాంతాల్లో కొలువుదీరిన గణనాథుల సన్నిధిలో భక్తిశ్రద్ధలతో భక్తులు పూజలు చేశారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

మహబూబాబాద్ రూరల్: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన జిల్లా కేంద్రంలోని కురవి రోడ్ ఫ్లైఓవర్ బ్రిడ్జి సమీపంలో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా కేంద్రం శివారు సాలార్ తండాకు చెందిన బాదావత్ బాలకృష్ణ తన ద్విచక్ర వాహనంపై ఇంటికి వెళ్తున్నాడు. కురవి మండలంలోని పెద్దతండాకు చెందిన బానోత్ కృష్ణ ద్విచక్ర వాహనంపై సాలార్ తండా వైపు నుంచి జిల్లా కేంద్రంలోకి వస్తున్నాడు. రెండు ద్విచక్ర వాహనాలు కురవి రోడ్డు ఫ్లైఓవర్ బ్రిడ్జి మూలమలుపు సమీపంలో ఎదురెదురుగా ఢీకొనగా ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు.